ప్రతి మనిషిలో మరో మనిషి దాగి ఉంటాడు. ఆ లోపలి మనిషి సందర్భాన్ని బట్టి బయటపడుతూ ఉంటాడు. ఆ మనిషి చేసే గారడీ వల్ల బయటి మనిషి తప్పొప్పులు చేస్తూ ఫలితాలు అనుభవిస్తూ ఉండవలసి వస్తుంది. తప్పుచేయబోయేటట్లయితే ముందే మేల్కొని అంతర్గతంగాఉన్న మనిషిని అణిచివేయగలిగితే ఆ తప్పు జరగకుండా చూసుకోవచ్చు.

"ఏమండోయ్! మిమ్మల్నే! వింటున్నారా? రేపు మా దీపు వస్తోందట. ఫోన్ చేసింది" కంచంలో అన్నం వడ్డిస్తూ అంది సుజాత.

"దీపు ఎవరు?" డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ అన్నాడు సుధాకర్.

"అదేనండీ... దీప్తి. నేనెప్పుడూ చెప్తూ ఉంటానే... దాని గురించి"




కథా నిలయం ★ శ్రీకాకుళం

# అంతా ఇంతే!

"ఏమో... నువ్వు ఎప్పుడూ మీ వాళ్ళు ఎవరో ఒకరి గురించి గొప్పలు చెప్తూనే ఉంటావు. వాళ్ళల్లో ఈ దీప్తి ఎవరో నాకెలాగుర్తుంటుంది?" మామిడికాయపప్పు అన్నంలో కలుపుకుంటూ అన్నాడు సుధాకర్.

"అవున్లెండి... మీకు మావాళ్ళెందుకు గుర్తుంటారు? అయినా నేనేదో లేనిపోని బడాయిలు చెప్తున్నట్లు అలా మాట్లాడతారేమిటి?"

"అబ్బే! నేనలా అనలేదు సుజా"

"సరేలెండి. ఇప్పుడు మనమధ్య గొడవెందుకుగానీ దీప్తి ఇక్కడ గ్రూప్ ఎగ్జామ్స్ ఏవో రాయటానికి వస్తున్నదట. మనింట్లో నాలుగు రోజులు ఉంటానని చెప్పింది."

"అలాగా! ఆ... కొబ్బరిపచ్చడి ఇంకొంచెం వెయ్యి".

"అన్నట్లు మీరెప్పుడూ దాన్ని చూడలేదు కదూ! ఐదేళ్ళ కిందట మన పెళ్ళప్పుడు చూసి ఉంటారనుకుంటా. అక్కా! అక్కా! అంటూ నా వెనకే తిరిగేది. నేను కూడా దాన్ని చూసి చాలా రోజులయింది."

సుధాకర్ పెద్దగా ఆసక్తి చూపించకుండానే ఆమె మాటలు వింటూ భోజనం చేయసాగాడు.

"నా చిన్నప్పుడు... అంటే నేను స్కూలుకు వెళ్ళే రోజుల్లో దీప్తి వాళ్ళు మా ఇంటిపక్కనే ఉండేవాళ్ళు. ఎక్కువగా అది మా ఇంట్లోనే గడిపేది. ఎంతో తెలివైన పిల్లండీ. చాలా కలుపుగోలుగా ఉండేది"

"చాలు... చాలు..." పెరుగు వడ్డిస్తున్న సుజాత చేతికి చేయి అడ్డుపెడుతూ అన్నాడు సుధాకర్.

"పరీక్షలు వ్రాసేసి వెంటనే వెళ్ళిపోతానంటుందేమో... పదిరోజులైనా ఉండమని గట్టిగా చెప్పాలనుకుంటున్నాను"

"సరేగానీ! నీవరస చూస్తుంటే ఆ దీప్తి వస్తే నన్ను అసలు పట్టించుకునేలా లేవు" అంటూ చెయ్యి కడుక్కునేందుకు లేచాడు సుధాకర్.

"పోదురూ! మీకంతా వేళాకోళమే" అంటూ నవ్వింది సుజాత.

★ ★ ★

"అక్కా! బావ హీరోలా ఉన్నాడే" అంటూ టేబుల్ మీద ఉన్న ఫొటోని చేతుల్లోకి తీసుకుంది దీప్తి.

"ఫొటో చూసే ఇంత పొగుడుతోంది. ఇక మనిషిని చూస్తే ఏం చేస్తుందో" అనుకుంటూ "మావారికి దిష్టిపెట్టేలా ఉన్నావే" అంటూ నవ్వుతూ చేతుల్లోనుంచి ఫొటో తీసుకుని టేబుల్‌పైన ఉంచింది సుజాత.

సుధాకర్‌ని చూసాక దీప్తికి ఓ చిలిపి ఆలోచన వచ్చింది. ఇతనికి అక్కమీద ఎంత ప్రేమ ఉందో తెలుసుకోవాలి. అది ఎంత నిఖార్సయిందో కూడా తెలుసుకోవాలి అనుకుంది.

★ ★ ★

**అబ్బరాజు జయలక్ష్మి**

దీప్తికి పరీక్షలు పూర్తయ్యాయి. సుజాత అడిగిన వెంటనే పదిరోజులు ఉండటానికి ఒప్పుకుంది. "రిజల్ట్స్ కూడా తెలుసుకున్నాక ఒకే సారి వెళతానక్కా" అంది.

"చాలా సంతోషం దీపూ. నువ్వు అప్పుడే వెళ్ళిపోవటం నాకూ ఇష్టం లేదు" అంది సుజాత.

దీప్తి మాత్రం మనసులో బావకి నేను పెట్టబోయే పరీక్షలో రిజల్ట్ తెలుసుకోవాలి కదా! అనుకుంది. అప్పటినుంచి సుధాకర్‌తో ఎక్కువ చనువుగా ఉంటూ అతనిలోని మరో మనిషిని నిద్రలేపే ప్రయత్నం చేస్తూనే ఒకపక్క తన మాటలతో, ప్రవర్తనతో అక్క సహనానికి పరీక్ష పెట్ట సాగింది దీప్తి.


సుజాత కూడా చాలా రోజులకు వచ్చిన దీపూని ఎంతో ఆప్యాయంగా ఆదరించింది. ఆమె అడిగినవి, అడగనివీ అన్నీ చేసి పెట్టింది. హైదరాబాదులో చూడవలసిన ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూపించింది. దీప్తి కలుపుగోలుతనం తనకు తెలిసిందే అయినా సుధాకర్‌తో కూడా ఎంతో పరిచయంఉన్న దానిలా "బావగారూ! బావగారూ!" అంటూ రాసుకుని పూసుకుని తిరగటం నచ్చుటంలేదు. అయినా భర్త మీద ఉన్న నమ్మకం వలన ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఒకసారి సుధాకర్ ఇంట్లోలేనప్పుడు దీప్తి సుజాతను ఆటపట్టించాలని, ఆమెకు కోపం తెప్పించాలని చూసింది.

"అక్కా! బావ నాకు చాలా నచ్చాడు. నువ్వు 'ఊ' అంటే నేను బావను లైన్లో పెడదామనుకుంటున్నాను".

"ఏయ్! ఏమిటా మాటలు. నీకు ఇంకెవరూ దొరకలేదా తల్లీ నా మొగుడు తప్ప?"

"దొరుకుతారనుకో... అయినా బావనే ఎందుకు పెళ్ళి చేసుకోకూడదూ? అనిపిస్తోంది.



ప్రముఖ పద్యకవి దేవరెడ్డి వెంకటరెడ్డి రచించిన 'కచ్ఛపి' పద్యకావ్యాన్ని డా॥ సి. నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని వేమన విజ్ఞాన మందిరంలో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో సభాధ్యక్షులు ప్రముఖ శిల్పి ఎక్కా యాదగిరిరావు, కవి దేవరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ కవయిత్రి ఎన్. అరుణ, కృతి స్వీకర్త ఆచార్య ఎన్. గోపి ఉన్నారు.

విత్ యువర్ పర్మిషన్ ఓన్లీ"

"చాల్లే నోర్ముయ్! నీతో కాస్త సరదాగా మాట్లాడినంత మాత్రాన అలా డిసైడై పోనక్క ర్లేదు. అయినా ఆయన దగ్గర నీ పప్పులేం ఉడ కవు. ఆయన అలాంటివారు కాదు"

"అవునా? అంత నిబ్బరంగా ఎలా చెప్ప గలుగుతున్నావక్కా?"

"అది నీకు చెప్పినా అర్థంకాదులే. నేనంటే ఆయనకు చాలా ఇష్టం తెలుసా. నేను కనిపిం చకపోతే ఒక్కరోజయినా ఉండలేరు. అంతెం దుకు? మావారు శ్రీరామచంద్రుడే అనుకో. అం దులో నాకెలాంటి సందేహం లేదు" అంది సుజాత. అలాగా! అదీ చూద్దాం! అనుకుంది మనసులో దీప్తి.

పైకి బింకంగా అలా మాట్లాడినా సుజాత కు దీపు చొరవ నచ్చుటంలేదు. సుధాకర్ ప్రవర్త నలో కూడా ఏదో మార్పు కనిపిస్తోంది. వాళ్ళి ద్దరూ కలిసి కబుర్లలో పడి ఒక్కొక్కసారి సుజా తను కూడా పట్టించుకునేవారుకాదు. వేళకు టిఫిన్లు, కాఫీలు, వంటలు, పిండి వంటలు చేస్తూ వంట ఇంటికే అంకితం అన్నట్లు తన పనిలో తను ఉంటే వాళ్ళిద్దరి ముచ్చట్లకూ అం తులేకుండా ఉండేది. తనకు కొంచెం సాయం చేయమని దీప్తిని పిలిస్తే వచ్చినట్లే వచ్చి "అబ్బా! నాకు రావటంలేదక్కా" అనో, "ఇప్పుడే వస్తాను" అనో మళ్ళీ ముందు గదిలోకి వెళ్ళిపోయేది.

సుధాకర్ ఆఫీసుకు వెళ్ళేవరకూ అంటిపె ట్టుకుని ఉండటం, మళ్ళీ సాయంత్రం వచ్చింది మొదలు అర్ధరాత్రివరకూ కబుర్లు, జోక్స్, పగ లబడి నవ్వటాలు, మాటి మాటికీ ఒకరిని ఒక రు టచ్ చేస్తూ మీద పడిపోతూ మాట్లాడడం...

ఇవన్నీ సుజాత గమనిస్తూనే ఉంది. కానీ భర్త మీద నమ్మకంతో మౌనంగా ఉంది.

★ ★ ★

సుధాకర్‌కు దీప్తిని చూడగానే ముందు ఏ అభిప్రాయమూ కలుగలేదు. ఏదో ఇంటికి వచ్చిన ఒక చుట్టంలాగానే చూసాడు. తరువాత దీప్తి అతనితో ఎక్కువ చనువుగా మెలగటంతో అతనికి ఎందుకో సరదాగాను, ఉత్సాహంగానూ అనిపించింది. తనలో అందచందాలు, హీరో లాంటి పర్సనాలిటీ ఉండబట్టే ఆ అమ్మాయి తనపట్ల ఆకర్షితురాలవుతోంది అనుకున్నాడు. దీప్తి చొరవ అతనిలో ఏవో ఆశలను రేపింది. అవసరం ఉన్నా లేకపోయినా ఆ అమ్మాయిని టచ్ చేస్తూ మాట్లాడడం, కళ్ళల్లోకి చూస్తూనో, చెయ్యిపట్టుకోవటమో చేస్తున్నాడు. చాలా సహ జంగా ఉన్నట్లు ఉంటూనే అతిగా ప్రవర్తించ సాగాడు.

ఇంట్లో అప్సరసలాంటి భార్య ఉన్నా పర స్త్రీలలో కొత్త అందాలు కనిపిస్తూ ఊరిస్తూ ఉం టాయి కొందరికి. అవకాశం అందివస్తే కాదను కొనేవారు ఎవరు?

★ ★ ★

ఆరోజు సాయంత్రం సుధాకర్ ఆఫీసు నుంచి వచ్చేసరికి దీప్తి ఒంటరిగా ఉంది. సుజాత పక్కింటివాళ్ళతో కలిసి మార్కెట్‌కి వెళ్ళింది. దీప్తి కాఫీ కలిపి తెచ్చి ఇచ్చింది. కాఫీ తాగుతున్న సుధాకర్‌తో కబుర్లు చెప్పసాగింది. కానీ ఆ మాటల్లో అక్క ఉన్నప్పుడు ఉండే చిలిపి తనం, హుషారూ లేవు. ఏదో బెరుకు, మరేదో తడబాటు. బావతో దొరికిన ఏకాంతం ఆమెలో ఎందుకో ఆనందాన్ని కలిగించలేదు. పైగా ఆమెలో ఏవో తెలియని భయాందోళనలు మొ దలయ్యాయి.

కాఫీ తాగటం పూర్తయిన సుధాకర్ కప్పు

పక్కన పెట్టి దీప్తి పక్కన వచ్చి కూర్చుని భుజం పై చెయ్యి వేసాడు. ఉలిక్కిపడింది దీప్తి. ఏదో తప్పు చేస్తున్నాననే భావం కలగసాగింది.

"ఏంటి దీప్తీ! ఆలోచిస్తున్నావు?" అన్నాడు సుధాకర్. బావ చేతిని నెమ్మదిగా విడిపించుకుని "ఏం లేదు బావా! కొంచెం తలనొప్పిగా ఉందంతే!" అంటూ మరో మాటకు అవకాశమివ్వకుండా తనగదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.


సుధాకర్‌కి దీప్తి ప్రవర్తన వింతగా అన్పించింది. ఈ అమ్మాయి ఉన్నట్లుండి ఇలా అయిపోయిందేమిటి? అయినా ఈ ఆడపిల్లలంతా ఇంతే. దూరం నుంచి రెచ్చగొడతారు. దగ్గరకు వస్తే ఆకులా ముడుచుకు పోతారు అనుకుంటూ సోఫాలో రిలాక్స్‌గా కూర్చుని టి.వి. ఆన్ చేసి క్రికెట్‌మేచ్ చూడటంలో లీనమైపోయాడు.

దీప్తి గదిలో మంచం మీద పడుకుని మళ్ళీ ఆలోచనల్లో పడింది. లక్షణంగా ఉన్న అక్క కాపురాన్ని తను చేతులారా చెడగొట్టి ఏం సాధించాలని? ఆడది తనంతట తానేవచ్చి మీద పడితే ఏ మగవాడైనా చలించకుండా ఉంటాడా? బావకూడా సగటు మనిషే కానీ అపర ప్రవరాఖ్యుడేమీ కాదు కదా! అయినా అతన్ని పరీక్షించాలనిపోతే జరగరానిది ఏదయినా జరిగితే తనకే కదా నష్టం? ముల్లు, అరిటాకు సామెత లాగా తన జీవితమే నాశనం అవుతుంది.

అక్కను ఆటపట్టించాలని అలా మాట్లాడిందే కానీ అక్క ఒకవేళ అంగీకరించినా బావను తను చేసుకోదు గాక చేసుకోదు. శీలం విషయంలో స్త్రీలకు, పురుషులకూ ఒకటే నీతి అని,



'రమ్యభారతి' సాహిత్య త్రైమాస పత్రిక ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన చిన్న కథల పోటీ బహుమతి ప్రదానోత్సవ సభలో కథారచయిత వేలూరి సతీష్‌కుమార్ (న్యాడా) కు 'సోమేపల్లి' సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్న ప్రముఖ కథారచయితలు పెద్దిబొట్ల సుబ్బరామయ్య, పాపినేని శివశంకర్. చిత్రంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ధ్వానా శాస్త్రి, పొన్నూరు వేంకట శ్రీనివాసులు కూడా ఉన్నారు.




పెళ్ళికి ముందు పక్కదారులు తొక్కేవాళ్ళు ఆడయినా, మగయినా ఎవరైనా క్షమార్హులు కారని, పవిత్రంగా, అగ్నిసాక్షిగా వేదమంత్రాలతో జరిగే వివాహంలో వధూవరులిద్దరూ కూడా పవిత్రులుగానే ఉండాలని, జీవితాంతం వాళ్ళు ఒకరికి ఒకరు అన్నట్టుగా జీవించాలని... ఇలా ఎన్నో ఆశయాలు, ఆలోచనలూ ఉన్న తను ఇతనిని రెచ్చగొట్టడం ఎందుకు? లేని ఆపదను కొని తెచ్చుకోవటం ఎందుకు? బావ ఎలాంటివాడైతే తనకేమిటి?

బంధుత్వం ఏమీ లేకపోయినా పొరుగున ఉంటూ ప్రాణస్నేహితురాలిగా మెలిగినందుకు అభిమానంతో అక్క తనకు ఇంట్లో కొన్నాళ్ళు ఉండటానికి అవకాశం ఇచ్చింది. నేను తప్ప వేరే ఆడగాలి తగిలితేనే ఆమడదూరం పారిపోయే అపర శ్రీరామచంద్రుడు నాభర్త అని మురిసిపోతోంది. బహుశా సగటు స్త్రీ జాతి అంతా భర్తలను ఇలాగే నమ్ముతారేమో!

నీ భర్త ఎక్కువేంకాదు. అందరిలాంటి మగవాడే. నువ్వనుకుంటున్నట్లు శ్రీరామచంద్రుడేం కాదు అని అక్కకు తెలియజేయటంవల్ల అక్క మనసు పాడుచేయటం తప్ప తనకు ఒరిగేదేం ఉంటుంది? అందరు ఆడవాళ్ళలాగే భర్త మీద నమ్మకంతో కొండంత ధైర్యాన్ని, గుండెనిండా ప్రేమనూ నింపుకుని బ్రతకనీ. అసలు తను రెచ్చగొట్టకపోతే బావ శ్రీరామచంద్రుడేనేమో! అవకాశం కళ్లెదురుగా కన్పిస్తూంటే చలించిపోయాడేమో! నాకెందుకీ గొడవ? అనుకుని మరునాడే ఊరికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది దీప్తి.

* * *

మరో పదిరోజులు ఉంటానని చెప్పిన దీప్తి ఉన్నట్లుండి ఊరికి వెళ్ళిపోవాలని ఎందుకు తయారయిందో సుజాతకు అర్థం కాలేదు. ఉండమని బలవంతం చేయలేదు. ఎందుకో దీప్తిని ఇంకా కొన్నిరోజులు భరించాలనిపించలేదు. ఎందుకంటే భర్తమీద నమ్మకమున్నా మగబుద్ధిపై ఎంతోకొంత భయం పీడిస్తోందామెను. ●